

నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

అభినయ అమరావతి, నాటకశాల విజయనగరం సంయుక్త నిర్వహణలో నటరత్న నాటక పరిషత్ 9వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు గురువారం నుంచి నిర్వహించబోతున్నట్లు అధ్యక్షులు అభినయ శ్రీనివాస్, కార్యదర్శి గద్ద వరప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక గుమ్చీ కూడలి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నాటిక పోటీలు 6 ,7, 8 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు . ప్రతిరోజు సాయంత్రం నృత్య ప్రదర్శనతో మొదలై 6.30గంటలకు నాటికలు ప్రారంభమవుతాయని అన్నారు. మొదటిరోజు అసత్యం, సూత్రం, రెండో రోజు గేమ్, కిడ్నాప్, మూడవరోజు స్వప్నం రాల్చిన అమృతం, అమ్మ చెక్కిన బొమ్మ నాటికలు నిర్వహిస్తామని తెలిపారు ఈ నాటికలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

అన్నదాత అగచాట్లపై చర్చించేనా?

- కునారిల్లుతున్న వసతి గృహాలు
- సుఖీభవ, తల్లికి వందనం, పింఛన్ల కోసం ఇప్పటికీ ఎదురుచూపులే
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ఎటువైపు చూసినా అన్నదాత అగచాట్లే కనిపిస్తున్నాయి. ఓవైపు అధిక వర్షాలతో తగ్గిన మొక్కజొన్న, పత్తి దిగుబడి... ఇప్పటికీ ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రాలు, మరోవైపు వరి రైతులను ముంచేసిన మొంథా తుపాను... ఉచిత పంటల బీమా ఎత్తివేతతో రైతులకు కొరవడ్డ బీమా. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందకపోవడం ఇలా ఒకటా రెండా... ఎటు చూసినా రైతులకు కష్టనష్టాలే కనిపిస్తున్నాయి. మొదట్లో యూరియా కొరతతతో ఇబ్బందులు ఎదుర్కోగా, ఇప్పుడు ఇతర ఇబ్బందులన్నీ తోడయ్యాయి. మరోవైపు గిరిజన, సాంఘిక, బిసి సంక్షేమ హస్టళ్లు పుట్టెడు అసౌకర్యాలతో కునారిల్లుతున్నాయి. ముఖ్యంగా గిరిజన వసతి గృహాల్లో ముక్కుపచ్చలారని చిన్నారులు ఇటీవల కాలంలో మృత్యువాత పడ్డారు. ఇప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, సామాజిక పింఛన్లు పూర్తిస్థాయిలో అంద లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలు జిల్లా వాసులను వెంటాడుతున్నాయి. వీటిన్నింటిపైనా నేడు (గురువారం) జరగబోయే జిల్లా పరిషత్ సమావేశంలో చర్చ జరిగేనా? అన్న ఆశ, సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ముందుకొస్తున్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ, సేవాకార్యక్రమాల్లో లోటుపాట్లపై రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించాలనే సంకల్పాన్ని ప్రతి జెడ్‌పి సమావేశంలోనూ చర్చిస్తునే ఉన్నారు. కానీ, ఇప్పటి వరకు అటువంటి ప్రయత్నం చేయలేదు. దీంతో, అజెండాలో పేరొన్న అంశాల్లో మూడో వంతు అజెండాతో మమా అనిపిస్తున్నారు. ఈ సంగతి కాస్త అటుంచితే... ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచీ అధిక వర్షాలు కురవడంతో మొక్కజొన్న, పత్తిపంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపాయి. వచ్చిన అరకొర దిగుబడులను ఎండబెట్టుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో నాణ్యత కాస్త తగ్గింది. దీనికితోడు ఈ రెండు పంటల కొనుగోళ్లకు అధికార యంత్రాంగం ప్రకటన తప్ప, ఆచరణలో ఏర్పాటు చేయలేదు. దీన్ని అసరాగా చేసుకుంటున్న వ్యాపారులు, దళారులు నచ్చిన ధరకు కొనుగోలు చేసుకుంటున్నారు. మరోవైపు ఈ ఏడాది పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వం భరించకపోవడంతో గతంలో లక్షలాదిగా ఇన్సూరెన్స్ పొందిన రైతులు ఈసారి వేల సంఖ్యకు తగ్గారు. యూరియా కొరత, ఎరువులు, పురుగుల మందుల ధరల పెంపు వంటి కారణాలతో వ్యవసాయ పెట్టుబడులు రైతులకు తలకు మించిన భారంగా మారాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంట కూడా నీట మునిగిపోయింది. ఈ నేపథ్యంలో పంటలన్నీ ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు ఉదారంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ఇంకోవైపు తొలి నుంచీ అస్తవ్యస్తంగావున్న రోడ్లు ఇటీవల వచ్చిన మొంథా తుపాను కారణంగా మరింత అధ్వానంగా మారాయి. వీటిపై జిల్లాలో ఒక నిర్దిష్టమైన కార్యాచరణ లేకపోతే ప్రమాదాలు మరింతగా పెరిగే అవకాశాలు లేకపోలేదు.



ఉమ్మడి విజయనగరం జిల్లాలోని గిరిజన, సాంఘిక, బిసి వెల్ఫేర్ హస్టళ్లల్లో సమస్యలు పేరుకుపోయాయి. భవనాలు పెచ్చులు ఊడాపోవడం, బీటలువారడం వంటి ప్రమాదకర స్థితిలోవున్నాయి. ఆర్ఒ ప్లాంట్లు పనిచేయక తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మోనా ఛార్జీలు సరిపోవడం లేదు. పౌష్టికాహారలోపంతో విద్యార్థులు తంచూ అనారోగ్యాలకు గురౌతున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని సకాలంలో గుర్తించేందుకు వసతి గృహాల్లో ఎఎన్ఎంలు కూడా లేకపోవడం మరణ శాసనంగా మారుతోంది. ఇటీవల కురుపాం గిరిజన వసతి గృహంలో ఇద్దరు, సీతంపేటలో ఒకరు, సాలూరులో ఒకరు, మక్కువ మండలంలో ఒకరు మరణించడం ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. ఇక అన్నదాత సుఖీభవ పథకం జిల్లాలో చాలా మంది రైతులకు వర్తించలేదు. ముఖ్యంగా ఇనాం, దేవాదాయ శాఖ, పెద్ద రైతుల వద్ద కౌలుకు సాగుచేస్తున్న రైతులు ఈ పథకానికి నోచుకోలేదు. తల్లికివందనం కోసం ఇప్పటికీ చాలా మంది అర్హులు ఎదురు చూస్తునే ఉన్నారు. పింఛను పొందుతున్న భర్త చనిపోతే, అదే పింఛను భార్యకు వర్తింపజేయడం తప్ప కొత్తగా పింఛన్లు ఇవ్వడం లేదు. దీంతో, జిల్లాలో వందలాది మంది వితంతువులు, వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం ఎదురుస్తున్నారు. ఈనేపథ్యంలో వీటన్నింటిపైనా జిల్లా పరిషత్ సమావేశంలో చర్చజరుగుతుందా? లేదా? అన్నదానిపై జనం సర్వత్రా చర్చించుకుంటున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎసిబి సోదాలు

- 9గంటల పాటు తనిఖీలు
- కార్యాలయం సీజ్

ప్రజాశక్తి-భోగాపురం

విజయనగరం జిల్లా భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం అవినీతి నిరోధకశాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎసిబి అధికారుల బృందం ఆకస్మికంగా కార్యాలయానికి చేరుకొని తనిఖీలు ప్రారంభించడంతో ఉద్యోగులు, సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తనిఖీల సమయంలో కార్యాలయంలో ఉన్న ఉద్యోగులు, రైతులు, మధ్యవర్తులు సహా పలువురిని అధికారులు ఎక్కడి వారిని అక్కడే నిలిపివేసి సమాచారం సేకరించారు. గత కొద్ది నెలలుగా జరిగిన భూముల రిజిస్ట్రేషన్ ఫీజుల వివరాలను ఎసిబి అధశికారులు సమగ్రంగా పరిశీలించారు. రాత్రి 8గంటల వరకు నిరంత రాయంగా సాగిన సోదాలు సందర్భంగా పలు ముఖ్యమైన పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ సోదాలు సందర్భంగా కొందరు అధికారులు బయటకు వెళ్లే ప్రయత్నం చేసినా ఎసిబి అధికారులు వారిని ఆపి వివరాలు రికార్డు చేసినట్లు తెలిసింది. సోదాలు అనంతరం కార్యాలయాన్ని అధికారులు సీజ్ చేశారు. గురువారం కూడా సోదాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎసిబి డిఎస్‌పి ఎస్.రమ్య తెలిపారు. సోదాలపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు.


సీజ్ చేసిన కార్యాలయం

వరదలకు కొట్టుకుపోయిన పారాది కాజ్ వే

ప్రజాశక్తి - బొబ్బిలి

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పారాది కాజ్ వే కొట్టుకుపోయింది. వేగావతి నది ఉధృతంగా ప్రవహించి కాజ్ వే పైనుంచి వరదనీరు ప్రవహించడంతో నది ప్రవాహానికి 10 మీటర్లు వరకు కాజ్ వే కొట్టుకుపోయింది. మిగిలిన భాగం చిందరవందరైంది. తాజాగా వరద నీరు తగ్గుముఖం పట్టడంతో కాజ్‌వే కొట్టుకుపోయిన విషయం తెలిసింది. వరదనీరు తగ్గినప్పటికీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో భారీ వాహనాలను దారి మళ్లించారు. దారి మళ్లించిన రోడ్లు కూడా గోతులమయంగా ఉండడంతో బాడంగి, తెర్లాం - బొబ్బిలి, ఆకులకట్ట - పినపెంకి రోడ్లపై లారీలు కూరుకుపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాజ్ వేను త్వరితగతిన బాగు చేసి వాహనాలు రాకపోకలకు అనుమతులు ఇవ్వాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


శిథిలమైన కాజ్‌వే

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి ఎస్‌పి ఎఆర్ దామోదర్ సూచించారు. బుధవారం జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో రిసెప్షన్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్ళు, సంబందిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. సమస్యలు విన్నవించేందుకు వచ్చే ఫిర్యాదుదారులు తమ సమస్యను రాయలేని స్థితిలో ఉంటే వారి ఫిర్యాదును పోలీసులే రాసేలా చొరవ చూపాలన్నారు. గొడవల కారణంగా బాధితులు ఎవరైనా తిరిగి ఇంటికి వెళ్ళలేని స్థితిలో ఉంటే వారిని శక్తి సాధన స్వధార హోం, వన్ స్టార్ సెంటరులలో ఆశ్రయం కల్పించాలన్నారు. కేసు నమోదు చేసిన వెంటనే ఎఫ్.ఐ.ఆర్. కాపీని ఫిర్యాదుదారుడికి తప్పకుండా ఇవ్వాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, వివిధ పోలీసు స్టేషన్లుకు చెందిన సిఐలు, ఎస్ఐలు, రిసెప్షన్ కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సకాలంలో అందించాలి : జెసి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్ ఆదేశించారు. జిల్లా స్థాయి ఎస్ఎన్‌పి (సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం) సమావేశం జెసి ఛాంబర్‌లో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా సరుకులను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా అందిస్తున్న బియ్యం, పప్పు, నూనె సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని, నాణ్యమైన సరుకులనే సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లాలో 2,499 అంగన్వాడీ కేంద్రాలలో బాల సంజీవని పథకం లబ్ధిదారులకు సకాలంలో సరుకులు అందేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విమల రాణి, సివిల్ సప్లయిస్ డిఎం బొడ్డేపల్లి .శాంతి, పిఒఎన్‌సిడి సుబ్రమణ్యం, సిడిపిఒలు, సరుకుల సరఫరాదారులు పాల్గొన్నారు.




విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ యు.మాణిక్యం నాయుడు

ఉత్సాహంగా సైన్స్ డ్రామా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు స్థానిక కస్పా ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ పోటీలలో 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. బెంగుళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు బొండపల్లి జెడ్‌పి విద్యార్థులు ప్రదర్శించిన హైజిన్ ఫర్ ఆల్ ఎంపికైంది. ద్వితీయ స్థానంలో షికారు గంజి ఎపి మోడల్ స్కూల్ , తృతీయ స్థానంలో నర్సిపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల నిలిచాయి. విజేతలను డిఇఒ యు.మాణిక్యం నాయుడు అభినందించారు. కార్యక్రమంలో కస్పా హైస్కూలు హెచ్ఎం విశాలాక్షి , జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, రిసోర్స్ పర్సన్స్ కె.సతీష్ కుమార్, ఎ.భానుప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సమావేశం

విజయనగరం టౌన్ :జిల్లా గ్రంథాలయ సేవా సంఘం సమావేశం బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు సంభందించిన కార్యాచరణపై చర్చించారు. గౌరవాధ్యక్షులు నాలుగెస్సులరాజు మాట్లాడుతూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, అధ్యక్షులు కొత్తలి ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, పట్టణ కన్వీనర్ త్యాడా ప్రసాద్ పట్నాయక్, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య, చిరంజీవి రావు, జనార్దన్ రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వినతుల పెండింగ్‌ను సహించేది లేదు

- రీ సర్వేలో తప్పులు లేకుండా చూడాలి
- ప్రయివేటు ఆలయాల్లో సిసి కెమెరాలు
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

రెవిన్యూ సేవల కోసం అందిన దరఖాస్తులను గడువు లోగా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్..రాఎసుందర్ రెడ్డి తెలిపారు. ఇళ్ళ స్థలాలు, ఒబిసి సర్టిఫికేట్ , ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్‌లు, మ్యుటేషన్ తదితర సేవల కోసం అందిన దరఖాస్తులు నిర్దేశిత గడువు దాటకుండా పరిష్కారం కావాలన్నారు. ఆర్‌డిఒలు ప్రతిరోజూ తహశీల్దార్లతో సమీక్షించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. మండల వారీగా పెండింగ్ ఉన్న వినతుల పై ఆరా తీసారు. రీ సర్వేలో తప్పులు లేకుండా చేయాలని, క్షేత్ర స్థాయికి వెళ్లి ఆర్‌డిఒలు కూడా పరిశీలించాలని తెలిపారు. తహశీల్దార్లు రీ సర్వే లో జాగ్రత్త వహించాలని, లేదంటే అనేక గొడవలకు తావిచ్చిన వారవుతారని అన్నారు. ప్రైవేటు దేవాలయాల్లో రోజులో కనీసం వెయ్యిమంది భక్తులు హాజరయ్యే దేవాలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని , దేవాదాయ శాఖ, రెవిన్యూ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జే.సి సేదు మాధవన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ సక్రమంగా జరిగేలా ఆర్‌డిఒలు, తహశీల్దార్లు జాగ్రత్త వహించాలని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒలు, కీర్తి, రామ్మోహన్, సత్య వాణి , డిప్యూటీ కలెక్టర్లు, హౌసింగ్ పీడీ మురళీ, జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు, సర్వేశాఖ ఎడిలు, తహశీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు పాల్గొన్నారు.


దెంకాడ తహశీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

ప్రభుత్వ సేవలు సత్వరమే అందాలి

పూసపాటిరేగ, దెంకాడ : ప్రజలకు ప్రభుత్వ సేవలను తక్షణమే అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం దెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో తనిఖీ నిర్వహించారు. ముందుగా దెంకాడ తాహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్రప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న సేవలపై తహశీల్దార్ రాజారావును ఆరా తీశారు. ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కారం చూపాలని సూచించారు. పూసపాటిరేగ మండలంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఆన్‌లైన్ సేవలపై ప్రశ్నించారు. పెండింగ్‌లో లేకుండా చూడాలని, నిర్ణీత సమయంలోగా సేవలను అందించాలని డిటి సంజీవ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు.


కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

జిల్లా కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.
- ప్రజాశక్తి, విజయనగరంకోట

మూడో రోజుకు కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి బిల్లులు చెల్లించాలని, కాంట్రాక్టర్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ల సంక్షేమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ధర్నాను ఉద్దేశించి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బంగార్రాజు, రాజ్ కుమార్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ అధికారులు తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రాకపోవడం చాలా బాధాకరమన్నారు. పండగ ముందు బిల్లులు ఇచ్చే బాధ్యత తమదని చెప్పిన కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు టెండర్ లు పిలిచి ,పనులు పూర్తి చేసిన తర్వాత బిల్లులు విషయంలో సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బిల్లులు చెల్లించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో దువ్వి శ్రీనివాసరావు, రామారావు, సత్యన్నారాయణ, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వసతి లేని గృహం

- వార్డెన్ లేరు.. ఇన్‌ఛార్జి రారు
- తుప్పపట్టిన గేట్లు.. పనిచేయని ఆర్‌ఒ ప్లాంట్
- ఎప్పుడు కూలిపోతాదో తెలియని భవనం
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రూ. వేలు, లక్షలు పోసి చదివించలేక కొందరు.. పని చేస్తే తప్ప పూట గడవని వారు ఇంకొందరు తమ పిల్లలు ప్రయోజకులు కావాలని కలలు కంటూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చేర్పిస్తున్నారు. పిల్లలు కూడా తమలా కష్టపడకూడదని చదువుకొని ఉన్నతంగా స్థిరపడాలని ఆశ పడుతున్నారు. పభుత్వం చేస్తున్న ప్రకటనలు విని తమ పిల్లలను వసతి గహాల్లో చేరుస్తున్నారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అధికారుల అలసత్వం తోడవడంతో దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కనీస వసతులు లేక, సరైన భోజనమూ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణములోని సాయిబాబా గుడి వెనుకల గల ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు తామేమీ తప్పు చేయకుండానే శిక్షను అనుభవిస్తున్నామా అనే విధంగా వసతి గృహ పరిసరాలు ఉన్నాయి. ఇక్కడ నాలుగో తరగతి నుంచి టెన్త్ వరకు 22 మంది విద్యార్థులు ఉంటున్నారు. బీటలు వారిన గోడలు, పెచ్చులూడే స్లాబ్ లు, తుప్పు పట్టిన కిటికీలు, గేట్లు, గుంతలు పడిన ఫ్లోరింగ్‌తో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. హాస్టల్‌కు వార్డెన్ లేకపోగా ఇన్‌ఛార్జిగా ఉన్న వార్డెన్ కూడా ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. హాస్టల్ గేట్లు తుప్పుపట్టిపోగా, ఆర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులకు తాగునీరు కూడా కరువైంది. విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ కాకపోవడంతో చలిలో ఇబ్బందులు పడుతున్నారు. మెనూ అమలు కావడం లేదని, అసలు చికెన్ ఎప్పుడూ పెట్టడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. శిథిలావస్థకు చేరుకున్న భవనం ఎప్పుడు కూలిపోతుందోనని బిక్కుబిక్కు మంటూ కాలం వెల్లదీస్తున్నారు.


తలుపులేని గదిలో విద్యార్థుల చదువులు


శిథిలావస్థలో ఉన్న వసతిగృహం

అధ్వానంగా బాత్రూములు.. ఆరుబయట స్నానాలు

విద్యార్థులు కనీసం స్నానం చేయటానికి కూడా బాత్రూములు సక్రమంగా లేవు. వర్షం వచ్చిందంటే మీరు బయటకు పోయే దారి లేక బాత్రూమ్‌లకు వెళ్లలేని పరిస్థితి. భోజనం చేశాక చేతులు కడుక్కునే టాప్‌ల వద్ద స్నానాలు చేస్తున్నారు. వర్షం వస్తే భవనం కారిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

వచ్చారు.. వెళ్లారు..

ఇటీవల ఈ వసతి గృహాన్ని జిల్లా అధికారులు పరిశీలించి వెళ్లారు. కానీ వారు ఈ వసతి గృహంలో ఏ లోపాలను గుర్తించారో తెలియదు. ఇప్పటివరకు ఏ విధమైన చర్యలూ చేపట్టలేదు. కనీసం విద్యార్థులకు సరిపడా భోజనం పెడుతున్నారో లేదో కూడా వారిని అడగలేదని విద్యార్థులు చెబుతున్నారు.

సైన్స్ టూర్‌కు ఇద్దరు విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఇద్దరు విద్యార్థులకు అద్భుత అవకాశం లభించింది. సైన్స్ ఈవెంట్‌లలో ఉత్తమ ప్రదర్శన చేసిన డెంకాడ మండలం అక్కివరం మోడల్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న పతివాడ భానుప్రసాద్, వియ్యంపేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తెర్లంగి సంజనకు ఢిల్లీలో సెన్సు ప్లానిటోరియంను సందర్శించేందుకు అవకాశం దక్కింది. వీరిద్దరూ ఈనెల 6 నుంచి 8 వరకు నాసా, ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకోవడంతో పాటు సైన్ సెంటర్, సైన్స్ ప్లానిటోరియంను విజిట్ చేయడం, ఇండో రష్యన్ సెంటర్‌ను చూసేందుకు అవకాశం దక్కింది. వీరిని డిఇఒ యు.మాణిక్యం నాయుడు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఉషశ్రీ ఎంపిక

ప్రజాశక్తి-గరివిడి రూరల్



విజయనగరం విజ్జీ స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్‌లో కొండపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న జి.ఉషశ్రీ అండర్-14 గర్ల్స్ కబడ్డీలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈమేరకు పాఠశాల హెచ్ఎం డి.రాము, పిఇటి విజయలక్ష్మి తెలిపారు. ఎంపికైన విద్యార్థి ఉషను హెచ్ఎం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

7న ఉద్యోగ మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎజిఎల్ డిగ్రీ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, ఏదైనా పిజిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఈనెల 7న ఎజిఎల్ కాలేజీలో ఉదయం 9గంటల నుంచి ఉద్యోగ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. వయసు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. 12 బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన వారిని ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ వివరాలను https:// naipunyam. ap.gov.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అడ్మిట్ కార్డుతో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిపికెట్లు ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8099461303, 9988853335 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు

11,12 తేదీల్లో సివిల్ సర్వీసెస్ క్రీడాపోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు క్రీడాపోటీలు ఈ నెల 11,12 తేదీల్లో జరగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11న బాస్కెట్ బాల్, ఫుట్ బాల్ , ఖోఖో, హాకీ, కబడ్డీ, వాలీబాల్, స్విమ్మింగ్ (ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్) లో జరగనున్నాయని తెలిపారు. 12న బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, యోగ, టెన్నిస్, రెజ్లింగ్, టెన్నిస్ (విజ్జి స్టేడియం)లో జరగనున్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని ఈనెల 19 నుంచి 22వరకు జరుగు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారని తెలిపారు. సివిల్ సర్వీస్ ఉద్యోగులు తమ డిపార్ట్‌మెంట్ గుర్తింపు, ఆధార్ కార్డుతో పై షెడ్యూలు లో తెలుపబడిన వేదిక వద్ద ఉదయం 9గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9491767327 బి.రూప్ కుమార్, 7799620244 భార్గవిని సంప్రదించాలని తెలిపారు.

పిఎం యశస్వి ఉపకారవేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ పి.ఎం. యశస్వి ఉపకారవేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. తల్లితండ్రుల సాలీన ఆదాయం 2.5 లక్షల లోబడి అర్హత కలిగిన 9వ మరియు 11వ (ఇంటర్మీడియట్ మొదటి) సంవత్సరం చదువుతున్న బిసి, ఇబిసి, సంచారజాతుల కులాలకు చెందిన విద్యార్థులు ఈనెల 15లోగా https://yet.nta.ac.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి జె.జ్యోతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ ఆధారంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఎంపికైన 8,9,10వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.75వేలు, 11,12వ తరగతి విద్యార్థులకు రూ.1,25,000 మంజూరు చేస్తారని తెలిపారు. వివరాలకు సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వారి కార్యాలయములను (విజయనగరం7893002013 గజపతినగరం-9395397192, బొబ్బిలి-8897291863) సంప్రదించాలని తెలిపారు.

పాఠశాలలను సందర్శించిన డైట్ బృందం

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలలను డైట్ అధ్యాపక బృందం సందర్శించింది. బుధవారం కొత్తపేట మోడల్ ప్రైమరీ స్కూల్, గొర్లిపేట, సీతారామునిపేట ఎంపిపి పాఠశాలలను ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ (డైట్)అధ్యాపకులు కోటపాటి రజిత, సొమ్ము ఇందిర, మురళి పరిశీలించి విద్యార్థుల అభ్యాసన, బోధన అంశాలు, ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారామునిపేట, కొత్త పేట విద్యార్థుల అభ్యాసన బాగుందని అభినందించారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లిమర్ల: మండలంలోని సీతారామునిపేట గ్రామ అంగన్వాడి కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహార ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్త భారతి, సంతోషి ఆధ్వర్యంలో వైసిపి ఎస్సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు చేతులు మీదుగా పౌష్టికాహారం పంపిణీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా వర్కర్, అంగన్వాడి ఆయా తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు

రేగిడి: విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదని రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు అన్నారు. లక్ష్మీపురం హైస్కూల్లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్షలు ఉన్నాయని చెప్పారు. పిల్లలకు చదువుతోపాటు క్రమశిక్షణ ఎంతో అవసరమని మంచి మార్గంలో నడవాలని అన్నారు.

వైసిపిలో వంద కుటుంబాలు చేరిక

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన 100 టిడిపికి కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికి వైసిపి కార్యాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ వైసిపి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. వెలమల శంకర్రావు, వెలమల ప్రకాష్ రావు, ముడిదాపు తిరుపతిరావు, గొట్టాపు త్రినాధరావు, మంతెన ధనుంజయ, జెమదాల వెంకటరమణ, జక్కు తవిటినాయుడు, సూరి కొండ వేమన, వడ్డీ సునీలు, బొచ్చు జుజ్జులు, వెలమల అప్పలనాయుడు, వెలమల దాలినాయుడు, బోను త్రినాథ్, పూడి గంగు నాయుడు, ఆల్లాడ రాములు తదితరులు టిడిపిని వీడి వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు టి.దామోదర్, నాయకులు జి.సూర్యనారాయణ, వి.శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయం పరిధిలో గల అరిగిపాలెం అంగనవాడి కేంద్రం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్నెస్ సెంటర్ సిహెచ్ఒ పార్వతారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బెర్రీ పరిశ్రమలో రక్తదాన శిబిరం

బొబ్బిలి: స్థానిక గ్రోత్ సెంటర్లో ఉన్న బెర్రి ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని యాజమాన్య ప్రతినిధులు అగర్వాల్, నీరాజ్ కుమార్ ప్రారంభించారు. రక్త నిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరం నిర్వహించి ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో 65 మంది ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఆర్ మేనేజర్ రాజు, యాజమాన్య ప్రతినిధులు రవీంద్ర సింగ్, త్రిపాటి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి గుంతలకు మరమ్మతులు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామానికి వెళ్లే బిటి రోడ్డు తుపాను కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ గుంతలు ఏర్పడి మరమ్మతులకు గురైంది. దీంతో గ్రామస్తులు వాహనదారులు ఇబ్బందులు పడేవారు. స్పందించిన తిమిడి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నియోజకవర్గ నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు తన సొంత నిధులతో గుంతలలో గ్రావెల్ పోయించి లెవెల్ చేయించారు. దీంతో గ్రామానికి వెళ్లే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సీతారాంపురంలో ఎంపిడిఒ తనిఖీలు

గజపతినగరం : మండలంలోని సీతారాంపురంలో బుధవారం ఎంపిడిఒ బి.కళ్యాణి విస్తృత తనిఖీలు నిర్వహించారు. గ్రామ సచివాలయం, ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని, అంగన్వాడి కేంద్రాన్ని ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా సచివాలయాన్ని పరిశీలించిన ఆమె ఉద్యోగుల హాజరు పట్టికను, సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించి సంతృప్తి చెందారు. ప్రజా సమస్యల ఫిర్యాదులకు సంబంధించి పెండింగ్ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ స్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. స్వయంగా పిల్లలకు పెట్టే భోజనాన్ని స్వీకరించి రుచి, నాణ్యత విషయంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిలో బాలికలకు వైద్య పరీక్షలు

మెరకముడిదాం: మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాల కౌమార దశ కిశోర బాలికలకు బుధవారం స్థానిక పిహెచ్సి వైద్యాధికారి కె.అజిత్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం రుగ్మతలు ఉన్న బాలికలకు మందులు పంపిణీ చేశారు. అనంతరం కిషోర్ బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా కాచి చల్లార్చిన నీరు తాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం తరగతి గదులను, వంటగదిని, స్నానపు గదులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రామారావు, హెల్త్అసిస్టెంట్ వర్మ, ఎఎన్ఎం కోటేశ్వరి, సూపర్వైజర్ పాల్గొన్నారు.

గాయత్రి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

శృంగవరపుకోట: మండలంలోని రాజీపేటలో ఉన్న గాయత్రి సంబలి నగరి ఆలయంలో అమ్మవారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 300 కిలోల ఆవు నెయ్యి, 300 మీటర్ల ఒత్తితో పాటు 9 కేజీల కర్పూరంతో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతిని మంత్రి వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, పిఎసిఎస్ చైర్మన్ జిఎస్ నాయుడు, మార్కెట్ వైస్ చైర్మన్ ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేట, సీతారాంపురం గ్రామాల్లో బుధవారం ఎఒ కిరణ్కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటపై తెగుళ్లను గుర్తించామన్నారు. కాటుక తెగులు, సుడిదోమ తెగులు ఉన్నాయని రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చిన సలహాలను పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు, విఎఎలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో భారీ అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో బుధవారం కార్తీకపౌర్ణమి నేపథ్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వంటాకు సన్యాసమ్మ, ఉప సర్పంచ్ వంటాకు శ్రీను, మహిళా కోలాటం భజన గురువు, ఉపాధ్యాయులు రామసత్యం, సత్తిబాబు, డీలర్ రామకృష్ణ, యుటిఎఫ్ యూనియన్, యువజన సంఘం సభ్యులు మహిళలు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పిహెచ్సిని తనిఖీ చేసిన డిఎంహెచ్ఒ

డెంకాడ: స్థానిక పిహెచ్సిని బుధవారం డిఎంహెచ్ఒ జీవనరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్సిల్లో డెలివరీలను పెంచాలని ఆదేశించారు. మాతా శిశుసంరక్షణ కార్యక్రమాల్లో శ్రద్ధ వవహించాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసి చికిత్సలు చేయాలన్నారు. టీకాలు కార్యక్రమల్లో వైద్య సిబ్బంది అలసత్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పిహెచ్సికి చికత్స కోసం ఎంతమంది రోగులు వస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. అనిల్ కుమార్, పిహెచ్సి సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్ కె.దుర్గారావు, ఫార్మాసిస్ట్ అప్పలనాయుడు, స్టాఫ్ నర్సు మీనాకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ గోవింద్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పలు క్రీడలకు ఎంపికయ్యారు. జూడో, క్రికెట్ ,బేష్బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. వీరంతా భవిష్యత్తులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మంచి పథకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జూడో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని భవాని నగర్ వద్ద గల డాక్టర్ వరలక్ష్మి వ్యాయామ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతన్న వంగపండు యమున అంతర కళాశాలల జూడో పోటీలలో పాల్గొని అంతర విశ్వవిద్యాలయాల జూడో పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భార్గవ్ రామ్ బుధవారం తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్లోని భూపాల్లో జరగనున్న అంతర విశ్వవిద్యాలయాల జూడో పోటీలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరుపున యమున పాల్గొంటుందని తెలిపారు. యమునను కళాశాల యజమాన్యం రాజేంద్రప్రసాద్, డాక్టర్ వరలక్ష్మి తదితరులు అభినందించారన్నారు.



జోడోకు ఎంపికైన యమున

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థి

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్ దేవేందర్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 క్రికెట్ టీమ్కు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు బుధవారం తెలిపారు. ఈ ఎంపిక పోటీలు విజయనగరం విజ్జీ స్టేడియంలో ఈ నెల 4న జరిగాయన్నారు. దేవేందర్ స్పిన్నర్గా ఎంపికయ్యాడని, త్వరలో జరగబోవు రాష్ట్ర స్థాయి అండర్ 17 క్రికెట్ పోటీలలో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. ఎంపికైన దేవేందర్ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సగుబండి శివరామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారన్నారు.

క్రికెట్ పోటీలకు పవన్

గంట్యాడ: మండలంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో 9వ తరగతి చదువుతున్న కొర్ర పవన్ క్రికెట్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. జామి మండలం మాధవరావు మెట్ట గ్రామానికి చెందిన పవన్ను బాలుర హాస్టల్ వార్డెన్ గొర్ల గోవింద, సన్యాసిరావు అభినందించారు


గంట్యాడ: పవన్ను అభినందిస్తున్న వార్డెన్

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు బాడంగి విద్యార్థులు

బాడంగి: బొబ్బిలి మండలం పారాది జెడ్ పాఠశాలలో జరిగిన అండర్ 19 జిల్లా స్థాయి బేస్ బాల్ క్రీడలో బాడంగి పాఠశాలకు చెందిన పువ్వల లవకుమార్, కండి రమ్య, ఎం. ప్రసన్న సత్తా చాటారు. ఈ నెల 7న నుంచి 9 వరకూ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు విజయనగరం జిల్లా తరుపున ఆడనున్నారని హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. విద్యార్థులను, శిక్షణ అందించిన పీడీలు రాము, రత్నాకర్, లోకేష్లను ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ పోటీలో గురజాడ విద్యార్థుల ప్రతిభ

విజయనగరం టౌన్ : జిల్లా స్కూల్ గేమ్స్లో గురజాడ పాఠశాలకు చెందిన ముగ్గురు 9వ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చెస్ అండర్ 19 విభాగంలో కె. అనురాగ్ విశ్వాస్ ,క్రికెట్ అండర్ 17 విభాగంలో డి.భార్గవ్, స్విమ్మింగ్ అండర్ 14 విభాగంలో డి. లతీఫ్ కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 7నుంచి రాష్ట్రస్థాయికి జరుగుతున్న స్కూల్ గేమ్స్ కు ఎంపిక అయినందుకు స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ వ్యాయామ ఉపాధ్యాయులు పి. సన్యాసి నాయుడు అభినందించారు.

జిందాల్ సమస్యలపై పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ బాధితులను రాష్ట్ర ప్రభుత్వం, జిందాల్ యాజమాన్యం ఉమ్మడిగా మోసం చేయడంతోపాటు బాధితుల సమస్యల పరిష్కరించడంలో విఫలమయ్యారని అందుకే ప్రధాని మోడీకి తెలియజేయాలనే లక్ష్యంతో పోస్ట్కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు సిపిఎం నాయకులు చల్లా జగన్ తెలిఆపరు. బుధవారం బొడ్డవరలోని జిందాల్ నిర్వాసితుల శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ న్యాయం కోసం గత 140 రోజులుగా శాంతియుతంగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నా ఎటువంటి స్పందనా లేదని తక్షణమే జోక్యం చేసుకుని తమ భూములను, తమ జీవనాధారాన్ని కాపాడి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిందాల్ బాధితులు పాల్గొన్నారు.

జెసి రాజుకు నేషనల్ గ్లోరి అవార్డు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణానికి చెందిన సామాజిక సేవా సంస్థ కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ జెసి రాజు ఫౌండేషన్ ద్వారా 23 సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపు నిస్తూ విశాఖపట్నానికి చెందిన కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ సంస్థ నేషనల్ గ్లోరి అవార్డ్ 2025కు ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను సిడిసి సంస్థ పంపించినట్లు ఆయన బుధవారం తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 9వ తేదీ రుషికొండ సమీపంలోని సాయిప్రియ బీచ్ రిసార్ట్స్లో ప్రదానం చేస్తారని సిడిసి సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. అన్నపూర్ణ తెలియచేసినట్లు ఆయన తెలిపారు.

బాలికల విద్యకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రేగిడి

పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు బాలికల విద్యకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే కోండ్రు మురళీ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ.1.94కోట్లతో కస్తూరిబా అదనపు బాలికల వసతి గృహాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ వసతి గృహాలను బాలికలు వినియోగించుకోవాలని కోరారు. డిఇఒ మాణిక్యంనాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఉన్నత పాఠశాలల సమీపంలో కస్తూరిబా-4 టైప్ అదనపు భవనాలు నిర్మించి దూర ప్రాంత విద్యార్థినులకు పాఠశాలలో ఉండి చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దూబ దర్మారావు, కిమిడి అశోక్ కుమార్, నారు జనార్ధనరావు, పాలూరి రామినాయుడు, ఇఇ హరిప్రసాద్, తహశీల్దార్ కృష్ణలత, ఎంపిడిఒ శ్యామలకుమారి, ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య, ఆర్డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్, ఎపిఒ సంకాబత్తుల హరినాద్, కాంట్రాక్టర్ కర్నేన గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: స్థానిక సారధి 6వ వార్డులో గల జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో రూ.2కోట్లతో నిర్మించిన అనుబంధ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం రాజాం మున్సిపాలిటీ పరిధిలో గల కొండంపేటలో గల కల్లాల వీధికి రూ.16.85 లక్షలతో మంజూరు అయిన సీసీ రోడ్డు, దేవుడమ్మ వీధిలో రూ.12.80లక్షలతో మంజూరైన సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వస్త్రపురి కాలనీలో నూతన రేషన్ షాపును ప్రారంభించి, రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాన నారాయణ రావు, దుప్పల పూడి శ్రీను, టంకాల కన్నం నాయుడు, బవిరి శ్రీనుబాబు, శాసపు రమేష్ కుమార్, అడపా శ్రీను, జనసేన నాయకులు యూపీ రాజు, రమేష్, గెడ్డపు నీలకంఠం, నాగరాజు, బిజెపి నాయకులు మిత్తిరెడ్డి మధుసూదనరావు, గౌరి నాయుడు పాల్గొన్నారు.


వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రయివేటీకరణను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటీకరణను వ్యతిరేకించాలని వైస్ ఎంపిపి, వైసిపి పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షులు సారికి వైకుంఠం అన్నారు. బుధవారం అలుగోలులో ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేటు పరం చేయడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ పోస్టర్ విడుదల చేసి కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కోటి సంతకాలు సేకరణ జరిపి ఈ నెల 11న నియోజకవర్గం స్థాయిలో నిరసన ధర్నా చేస్తామని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మాల్యాడలో వైసిపి నాయకులు పప్పల బలరాం ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బానాది, కొంపల్లి, కృష్ణరాయుడుపేటలో బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రైవేటీకరణకు నిరసనగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎన్.వెంకట్రావు, సర్పంచ్ కర్రీ యశోద, జగ్గయ్యపేట ఉపసర్పంచ్ వంటాకు శీను, వైసిపి నాయకుడు గళ్ళ రామచంద్రుడు, కొంపల్లి, కృష్ణరాయుడుపేట, కెఆర్పేట సర్పంచ్ బాలబాబు, కొంపెల్లి సర్పంచ్ అరుణ పాల్గొన్నారు.

గజపతినగరం: మండలంలోని గంగచోళ్ళ పెంట గ్రామంలో బుధవారం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. గ్రామానికి చెందిన వికలాంగుడు కనకల శ్రీను తన మొదటి సంతకంతో గ్రామస్తుల్లో చైతన్యం తేవడం శుభసందర్భమని నాయకులు అన్నారు. చంద్రబాబును నమ్మి ప్రజలు మోసపోయారని ఇప్పటికైనా కళ్లు తెరవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూదేవి పేట సర్పంచ్ కనకల సుబ్రహ్మణ్యం, గంగచోళ్ళ పెంట సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపిటిసి కనకల పైడుపునాయుడు, కాళ్ల రాము, తమ్మినేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'పది' ఉత్తీర్ణత తప్పనిసరి : డిఇఒ

ప్రజాశక్తి- రేగిడి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలంటే తొలి మెట్టైన 10వ తరగతి ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యంనాయుడు అన్నారు. బుధవారం లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా 10వ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రశ్నలు వేసి జవాబును రాబట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయినించే తమ లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రస్తుత రోజులలో పోటీ తత్వం ఉంటుందని, వాటిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ పోటీ ప్రపంచంలో వైజ్ఞానిక పద్ధతుల ద్వారా విద్య అవసరమన్నారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికలు చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన సబ్జెక్టుల ప్రకారం ఇంటి వద్ద చదివి ప్రతిభను కనబరచాలన్నారు. ప్రతీ విద్యార్థి బాధ్యతగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. పిల్లల ఎదుగుదలకు విద్యతోపాటు క్రీడల కూడా దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.కృష్ణలత, ఎంపిడిఒ శ్యామలకుమారి, ఎంఇఒలు ఎం.వర ప్రసాద్ రావు, ఎరకయ్య, ఆర్.ఐ కోటగిరి హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

గుంతతో చింత

ప్రజాశక్తి- బాడంగి


గుంతలో కూరుకుపోయిన లారీ

నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఏర్పడుతున్న గుంతలతో వాహనదారులకు చింత తప్పడం లేదు. బాడంగి మండల కేంద్రంలో ప్రధాన రహదారి గుంతలు పడటంతో ఎప్పటికప్పుడు భారీ వాహనాలు ఆ గుంతలో ఇరుక్కుపోయి నానా ఇబ్బందులు పడుతున్నాయి. బుధవారం కూడా బాడంగి మీదుగా రామభద్రపురం వెళుతున్న భారీ లారీ రోడ్డు మధ్యలో పడిన గుంతలో దిగబడిపోయి నానా తంటాలు పడింది. ఇది ఇక్కడ నిత్య కృత్యమని ప్రజలు చెబుతున్నారు. ఈ రోడ్డులో శ్రీకాకుళం నుంచి బాడంగి మీదుగా రామభద్రపురం, రాయగాడ వరకూ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇటువంటి ప్రధాన రహదారిలో గుంతలు పడితేనే పట్టించుకోకపోతే ఎలా అని ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇటీవల ఈ గుంతల్లో పడి కోడూరుకు చెందిన ఒక వ్యక్తి కూడా మరణించిన విషయం తెలిసిందే.

స్కిల్ డెవలప్మెంట్పై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

స్కిల్ డెవలప్మెంట్పై స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గం స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ దాడిశెట్టి శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీనిని నియోజకవర్గంలో ఉన్న ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఇక్కడ అవగాహన పొందిన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారి చేత చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ అవగాహన కార్యక్రమం 20 రోజులు పాటు ఉంటుందని, 12 రోజులు అవగాహన కల్పించి మిగిలిన ఎనిమిది రోజులు వివిధ కంపెనీలకు తీసుకువెళ్లి కంపెనీల ప్రతినిధులతో మాట్లాడిస్తామని చెప్పారు. ఆయా కంపెనీలపై అవగాహన కూడా కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ప్రతినిధులు, పలువురు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, విపత్తుల నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ ఇతరులను కాపాడడం ఎలా అనే అంశాలపై స్థానిక హిందూస్థాన్ డిఫెన్స్ అకాడమిలో విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి. వై.అశోక్కుమార్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం కాపాడుకోవడం ఎలా, ఇతరులను కాపాడడం ఎలా, గ్యాస్, పెట్రోల్, డీజిల్ వాటి నిప్పుత్తులను ప్రమాదాల నుంచి ఎలా కాపాడాలి అనే విషయాలపై సిబ్బందితో విన్యాసాలు చేయించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ హరిప్రసాద్, సత్యనారాయణ, దేవుడు, ఫైర్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల


అధికారికి సమస్యను వివరిస్తున్న నాయకులు

తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ అధికారి లిఖితను కలిసి వినతినిచ్చారు. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వరిపంట మొత్తం నెలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం త్వరితగతిని అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు నష్టపరిహారంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధులను తక్షణమే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

పత్తి రైతులను ఆదుకోండి: ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి- బొబ్బిలి రూరల్

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంగిరెడ్డి గోపాలు, నాయకులు రెడ్డి త్రినాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శంకర్రావు డిమాండ్ చేశారు. బుధవారం జె.రంగరాయపురం, పాత్రేరు గ్రామాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుపాను కారణంగా పత్తి దిగుబడి సగానికి సగం తగ్గిపోయిందన్నారు. గత ఏడాది క్వింటాకు రూ.7వేలు నుంచి రూ.8వేలు రేటు ఉండగా ఈ ఏడాది రూ.5300లకు పడిపోయిందన్నారు. తుపాను వల్ల నష్టపోయిన పత్తిపంటకు నష్టపరిహారం చెల్లించాలని, క్వింటాలకు ప్రభుత్వం రూ.10వేలు ధర నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా రైతులందరూ ఐక్యమై పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా, బలవంతపు భూ సేకరణ ఆపేలా పోరుబాటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

ప్రజాశక్తి - వేపాడ

పేద రైతుల నుంచి బలవంతపు భూసేకణ ఆపాలని, రాష్ట ప్రభుత్వం ఏటా కేబినెట్ సమావేశంలో పేదల భూమి ఎవరికి ఎంత ఇవ్వాలి అనే నిర్ణయాలే చేస్తున్నారు తప్ప, భూమి కాల్పోయిన రైతులను ఎలా ఆదుకోవాలో అనే నిర్ణయాలు గాలికి వదిలేసారని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ అన్నారు. ఈ నెల 9న ఎస్కోటలో జరగనున్న రైతు సంఘం జిల్లా మహసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండలంలోని కోట సీతారాంపురంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహసభలో భూ దోపిడీకి వ్యతిరేకంగా చర్చిస్తామన్నారు. భవిష్యత్తులో జిల్లాలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, శృంగవరపుకోట, జామి, గంట్యాడ, బొండపల్లి మండలాల్లో చిన్న రైతుల వద్ద భూమి మిగలదన్నారు. ఇప్పటికే ఈ మండలాల్లో ఐఒసీ పైప్ లైన్, హెచ్పిసిఎల్ పైపు లైన్, గ్రీన్ ఫీల్డ్ హైవే, పోలవరం ఎడమ కాలువ, పెందుర్తి - బొడ్డవర రోడ్డు రైల్వే లైన్లు, జిందాల్, అదానీ ఇలా అందరికి భూమి దార పోస్తున్నారని చెప్పారు. పై విషయాలు అన్నింటిపైనా మహసభలో చర్చిస్తామని జిల్లాలోని రైతులందరూ ఎస్కోటలో జరగనున్న సభకు హాజరుకావాలని కోరారు.

సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు వివిధ కార్పొరేషన్ల ద్వారా కల్పించే సబ్సిడీ రుణాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్మెంట్ జనరేషన్ స్కీమ్లో భాగంగా వేపాడ మండలం చిన్నగుడిపాల గ్రామానికి చెందిన లండ ముసలి నాయుడు, చామలాపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్, కొండగంగుపూడి గ్రామానికి చెందిన కొట్టాన రమణకు రూ.1.05లక్షల సబ్సిడీతో రూ.3.15లక్షల విలువ గల ఆటోలను లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయం వద్ద లబ్ధిదారులకు మూడు ఆటోలను ఆమె బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, పిఎసిఎస్ డైరెక్టర్ గంటుపల్లి దేముడు నాయుడు, ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జ్ జామి అప్పలనాయుడు, సీనియర్ నాయకులు దుల్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, మాజీ ఎంపిటిసి నిరుజోగి అమ్మతల్లినాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు గొర్రెపోటు రామం, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు అనకాపల్లి చెల్లయ్య, పెదగాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

నదిలో పడి మహిళ మృతి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ఆనవరం గ్రామానికి చెందిన అంపవల్లి సంతు (31) వేగావతి నదిలో పడి మృతి చెందింది. స్థానికులు అందించిన కథనం ప్రకారం..కార్తీక పౌర్ణమి సందర్భంగా రోజంతా ఉపవాసం ఉన్న సంతు బుధవారం సాయంత్రం వేగావతి నదిలోకి స్నానానికి దిగింది. గోతులతో ఉన్న నదిని అంచనా వేయకపోవడంతో మునిగిపోయింది. స్థానికులు వెంటనే గుర్తించి బయటకు తీసి చికిత్స నిమిత్తం బాడంగి సిహెచ్సికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పది మందిపై బైండోవర్

ప్రజాశక్తి- కొత్తవలస

మండలంలోని బెల్టు షాపులు నిర్వహిస్తూ గతంలో పట్టుబడిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ సిఐ రాజశేఖర్నాయుడు అన్నారు. బుధవారం తహశీల్దార్ పి. అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కేసులు పెట్టినట్లు ఆయన తెలిపారు. కేసులను ఉల్లంఘించి బెల్టు షాపులను నిర్వహిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా వేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రతపై అవగహన

డెంకాడ: మండలంలోని దువ్విపేట, జొన్నాడ పాఠశాలల్లో బుధవారం లెండి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పబ్లిక్ డ్రెయిన్ లను శుభ్రం చేసి, ప్లాస్టిక్ సేకరించారు. స్థానిక పాఠశాల, కమ్యూనిటీ హాల్ చుట్టూ శుభ్రత కార్యక్ర మాలు చేపట్టారు. ఒక వీధి నాటకం ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత, పబ్లిక్ సానిటేషన్, డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నిరోధకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రవితేజ, అధ్యాపకులు డెక్కా సతీష్, అజీజ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు యశ్వంత్, తనుశ్రీ, నవ్య, దినేష్, దీక్షిత, జనని, షాజిద్ తదితరులు పాల్గొన్నారు.